iLovePDF

TGTEL/25/A0784

# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.

9100900918

9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | మంగళవారం | 08 - 07- 2025 | సంపుటి : 1 | సంచిక : 36 | పేజీలు : 8 | వెల : 4/-



## ఆగమైన శాఖలన్నీ నాకే ఇచ్చారు

- శాఖల కేటాయింపుపై మరో మంత్రి అసంతృప్తి
- నాడు కొండ సురేఖ... ఇప్పుడు వాకిటి శ్రీహరి

3 లో..



## అక్బరుద్దీన్‌కు హైడ్రా మినహాయింపులా?

- బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శలు

3 లో..



## పేదల సంక్షేమం లక్ష్యంగా పథకాలు

- పదేళ్లలో పేదలను విస్మరించిన కెసిఆర్
- సొంత ప్రయోజనాలు కాపాడుకున్న నేత
- జుక్కల్ పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి

3 లో..



## ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జీలు

- పేర్లు ప్రకటించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

3 లో..



## మహిళలకు రేవంత్ సర్కార్ మరో వరం





# సమర్థతకు పరీక్ష..?

- జూబ్లీహిల్స్ బై పోల్ అన్ని పార్టీలకు సవాలే
- ఈ ఎన్నికల ఫలితాలే భవిష్యత్తును శాసించనున్నాయా
- ఈ ఎన్నికలతోనే కాంగ్రెస్.. బీజేపీ.. బీఆర్ఎస్ భవిష్యత్తు
- ఎంట్రీ ఇవ్వబోతున్న టీడీపీ?
- ఈ పార్టీ షాకిచ్చేదెవ్వరికీ?
- విజేతగా నిలిచేదెవ్వరూ?

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)

తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అన్ని పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అన్ని పార్టీల నాయకత్వాల సమర్థతకు ఈ ఎన్నికల ఫలితం పరీక్షగా మారనున్నది. ఒక ఉప ఎన్నికల ఏకంగా ఆయా పార్టీల నాయకత్వ పట్టిమకు సవాల్ గా మారుతుందా అన్న ప్రశ్నలు తలెత్త వచ్చు. కానీ ఇది వాస్తవం. ఈ క్రమం లోనే జూబ్లీహిల్స్

మిగతా 2వ పేజీలో..

# వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 సీట్లు

- ఇందిరమ్మ రాజ్యంలో ఆత్మగౌరవంతో ఆడబిడ్డలు
- ఒక్కొక్కరు బాధ్యతగా రెండు మొక్కలు నాటాలి
- అప్పుడే రాష్ట్రమంతా పరుచుకోనున్న పచ్చదనం
- అమ్మలు కూడా పిల్లల పేరుతో ఓ మొక్క నాటాలి
- ప్రపంచంతో పోటీ పడుతున్న తెలంగాణ మహిళలు
- వన మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



(నేటి ప్రభాత సూర్య-జనరల్ బ్యూరో)

వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోందని వెల్లడించారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ తెచ్చింది కాంగ్రెస్ అని ఉద్ఘాటించారు. త్వరలోనే చట్టసభల్లో కూడా మహిళలకు 33శాతం రిజర్వేషన్ రాబోతుందని ప్రకటించారు. 51 అసెంబ్లీ స్థానాలు మహిళలకు రిజర్వ్ కానున్నాయని చెప్పుకొచ్చారు. 51కి మరో పది కలిపి మహిళలకు ఎమ్మెల్యే సీట్లు కేటా యిస్తామని సీఎం రేవంత్ రెడ్డి



మిగతా 2వ పేజీలో..

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- యూరియా సరఫరాకై కేంద్రానికి వినతి
- రాష్ట్రానికి పెట్టుబడుల ఆహ్వానం
- హీరో అజయ్ దేవగన్.. కపిల్‌దేవ్‌తోనూ సీఎం భేటీ
- అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై చర్చ

3 లో..

# నాపై ఆరోపణలు నిరూపించాలి

- కేటీఆర్ స్థాయి నా కుమారుడి కంటే తక్కువే
- పత్రికపై దాడి సహించేది లేదు
- కేసీఆర్ తాగి పడుకుంటే.. ఉద్యమం నడిపింది ఆ పత్రికే
- అలాంటి పత్రికపై దాడి చేస్తారా
- కేసీఆర్ గుండాయిజం తెలంగాణలో నడవనివం
- దాడిచేస్తే చూస్తూ ఊరుకోం
- ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)



తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. ఒక పార్టీపై ఇంకోపార్టీ పరస్పరం విమర్శలు గుప్పించుకొంటున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం ముదిరింది. తన కుమారుడి దుస్తులపై విమర్శలు చేసిన కేటీఆర్ స్థాయి తన కుమారుడి కంటే తక్కువని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతి ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై దాడులను సహించేది లేదని హెచ్చరించారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు సైతం బీఆర్ఎస్ నేతల తీరును ఖండించారు. మీడియాకు రక్షణ కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి సంస్థలపై బీఆర్ఎస్ శ్రేణులు దాడులు చేసే అవకాశం ఉన్నట్లు వచ్చిన వార్తలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ రాసిన కథనం వాస్తవమని. తెలంగాణ కేసీఆర్ జాగీరా అంటూ కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ఏబీఎన్ మీద దాడి చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు ఛానల్ ఉందని. ఆ ఛానల్‌కు చుక్కలు చూపిస్తామంటూ వార్నింగ్ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా మేడిపల్లి మండలంలో పర్యటించిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు ఖరీదైన దుస్తులు ధరించినందుకు బీఆర్ఎస్ పార్టీ విమర్శించడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. 'నా కొడుకు కాస్ట్లీ బట్టలు వేసుకుంటే కేటీఆర్ ఓర్వలేకపోయాడు. కేసీఆర్ కొడుకు నా కుమారుడితో కొట్లాడుతాడు. అదే అతని స్థాయి' అని మండిపడ్డారు. తమ పిల్లలు ఎవరూ ఖరీదైన దుస్తులు వేసుకోకూడదా.. బిచ్చగాళ్లలా తిరగాలా అంటూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న

మిగతా 4వ పేజీలో..

# తల తాకట్టు పెట్టైనా హామీలు అమలు చేస్తాం

- అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు
- చుక్క నీటిబొట్టును.. రాష్ట్ర హక్కులను వదులుకోం
- కేసీఆర్ సర్కార్ పుణ్యమే బనకచర్ల ప్రాజెక్ట్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో) :



తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నంతవరకు ఒక్క చుక్క నీటి బొట్టును, తెలంగాణ రాష్ట్ర హక్కులను వదులుకునే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, నిజాయితీ ఉన్నాయని. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేశామని.. మరో మూడు విడతలు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లు రాని వారు ఎవరూ నిరుత్సాహ పడవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ నెల 14 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు

మిగతా 2వ పేజీలో..

# రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదు

- ఆయనది నోరా లేకుంటే మోరీనా
- నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే
- ఈ సర్కార్ కు కర్రు కాల్చి వాతలు పెట్టాలి
- మాజీ మంత్రి కేటీఆర్ విమర్శ

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకావడంలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారని. అవి చేయలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలకు చెందిన పలు పార్టీల నేతలు.. బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి కోతలు సరిపోవని.. కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. ఆ విధంగా మీరందరూ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలో చాలా మంది ముఖ్యమంత్రులను చూశామని కానీ ఇలాంటి ముఖ్యమంత్రిని తాను చూడలేదంటూ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిది నోరా లేకుంటే మోరీనా అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. రుణ మాఫీ లేదు రైతుబంధు

మిగతా 2వ పేజీలో..

# అక్రమ వెంచర్లపై మౌనమెందుకో?


- విమర్శలకు తావిస్తున్న కమిషనర్ల తీరు
- అక్రమ వెంచర్లపై బీజేపీ ఆగ్రహం
- కమిషనర్ల తీరుపై విచారణకు డిమాండ్
- లేని పక్షంలో ప్రజా ఉద్యమం
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన ఏదీ...?
- ఇది పరోక్షంగా అక్రమాలను ప్రోత్సహించడం కాదా!
- బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి విమర్శ
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



రంగారెడ్డి ప్రతినిధి-నేటి ప్రభాత సూర్య:

బడంగ్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతన్న అక్రమాలపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికార్ల మౌనమెందుకు అని ప్రశ్నించంది. ఈ మౌనంతో అక్రమాలను కమిషనర్ ప్రోత్సహించినట్లు కాదా అని ప్రశ్నించింది. ఈ మేరకు సోమవారంనాడు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ వెంచర్లపై ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌కు బీజేపీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందజేశారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో

మిగతా 4వ పేజీలో..



## సర్కారు ఆఫీసుకు తాళం!

- అబ్దుల్లాపూర్‌మెట్ ఆ కార్యాలయానికి తాళం
- కారణం తెలిస్తే అవాక్కవాల్సిందే
- గత్యంతరం లేకే అలా చేశా : భవన యజమాని

2 లో..

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం పడటంతో కలకలం రేగింది. ఏకంగా 38 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

iLovePDF





# విద్యుత్ లేక.. నీరు రాక రైతు ఆవేదన!

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు కన్నీరు..
- ఉదయం 9 గంటలకు రావాల్సిన కరెంటు..
- సాయంత్రం 4:45 అయినా రాలేదు

**షాద్ నగర్ - నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ :**



జై జవాన్ జై కిసాన్ అంటారు కిసాన్ కన్నీరు పెట్టుకుంటున్నాడు దీనికి కారణం ఎవరు నిర్లక్ష్యం ఎవరు..? అనే ప్రశ్న అక్కడక్కడ వినిపిస్తున్నది మాట నిజమేనా అవును అనడానికి కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో ఓ చిన్న రైతు విద్యుత్తు లేక ఉదయం 9 గంటలకు రావలసిన కరెంటు సాయంత్రం నాలుగు గంటల 45 నిమిషాలు అయినా కరెంటు లేదు. ఇలా అయితే రైతు వరి విత్తనాలు మొలక ఎత్తడంతో నీరు లేక విద్యుత్తు రాక మొలక, మడి, ఎండిపోయింది .. రైతు అన్నమో రామచంద్ర అంటూ.. కరెంటు కోసం ఉదయం నుండి సాయంత్రం వరకు పొలంలో భోజనం లేకుండా తాగటానికి నీరు లేకుండా పడిగాపులు పడ్డాడు, కొత్తపేట గ్రామానికి చెందిన అగ్రఫ్ అనే సన్న చిన్న కారు రైతు వరి చేను కోసం ఓమడి వరి విత్తనాలు అలికెందుకు మండే పోసి మూడు నాలుగు రోజులైంది మడిలో మెలుకలు అలుకెందుకు (వేసేందుకు) సోమవారం ఉదయము పొలము దగ్గరికి వెళ్లి బోరు మోటర్ వేసి మొలకలకు నీరు పెడదాము అనుకున్నడు.. కానీ విద్యుత్తు లేదు విద్యుత్తు లైన్మెన్ కు ఫోన్ చేయగా పది నిమిషాలకు వస్తుందని అనీ నిర్లక్ష్యంగా చెప్పాడని ఆవేదన చెందుతూ.. ఉదయం నుండి సాయంత్రం 4:45 నిమిషముల వరకు ఎదురుచూసి ఎదురుచూసి రైతు గొంతు ఆరిపోయింది కానీ వ్యవసాయానికి కరెంటు రాలేదు నీరు రాలేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభాత సూర్య ప్రతినిధికి వీడియో ద్వారా విషయం తెలియజేశాడు. ఏది ఏమైనా అధికారులు ఇప్పటికైనా గ్రామాలలో రైతులకు విద్యుత్ సరఫరా లో జాప్యం చేయకూడదని పలువురు కోరుతున్నారు.

# ప్రభుత్వ కార్యాలయానికి తాళం!

- అబ్దుల్లాపూర్‌మెట్ ఆ కార్యాలయానికి తాళం
- కారణం తెలిస్తే అవాక్కవాల్సిందే
- గత్యంతరం లేకే అలా చేశా : భవన యజమాని






**అబ్దుల్లాపూర్‌మెట్ -నేటి ప్రభాత సూర్య :**

ప్రభుత్వ కార్యాలయానికి తాళం పడింది. తాళం వేసింది అధికార్లు కాదు. భవన యజమాని. ఎంత భవనానికి యజమాని అయితే ప్రభుత్వ కార్యాలయానికే తాళం వేస్తారా. అన్న సందేహం కలగకమానదు. కానీ దీనికి కారణం వింటే మాత్రం పాపం ఆయన చేసిన దాంట్లో నిజముందన్న లాజిక్ కనిపిస్తోంది. చట్టపరంగా ఇది ఎంతవరకు కరెక్ట్ అన్నది మీరు మేమూ తేల్చలేం. కానీ ఈ కథన ఏమిటో తెసుకోవాలంటే కారణాలను ముందుగా తెలుసుకోవాల్సిందే. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం పడటంతో కలకలం రేగింది. ఏకంగా 38 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని సోమవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అద్దె బకాయిలు చెల్లించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక వివరాలలోకి వెళ్లితే...రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం అనగా జులై 7వ తేదీన ఊహించని విధంగా తాళం పడింది. గత 38 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో బిల్డింగ్ యజమాని ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఉదయం కార్యాలయం తెరిచే సమయంలో డోర్లకు తాళాలు వేయడంతో, విధులకు వచ్చిన సిబ్బంది, అధికారులు, అలాగే రిజిస్ట్రేషన్ పనుల కోసం వచ్చిన ప్రజలు కార్యాలయం బయటే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిల్డింగ్ యజమాని మాట్లాడుతూ.. తాను సుమారు 15 సంవత్సరాల క్రితం తన భవనాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అద్దెకు ఇచ్చానని, అయితే గత 38 నెలలుగా అద్దె చెల్లించడం లేదని వాపోయారు. అద్దె బకాయిల సమస్యను పలుమార్లు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని. అయినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తాళం వేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిరీత్యా మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ఈ బిల్డింగ్‌పై లోన్ ఉందని ప్రతి నెలా ఈఎంఐలు చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆయన వివరించారు. బిల్డింగ్ యజమాని సబ్ రిజిస్ట్రార్‌కు రాసిన లేఖలో తన డిమాండ్లను స్పష్టం చేశారు. పేరుకుపోయిన పెండింగ్ రెంట్ మొత్తాన్ని 15 రోజుల్లోగా చెల్లించాలని అలాగే నాలుగు నెలల్లోగా భవనాన్ని ఖాళీ చేయాలని కోరారు. తనకు అద్దె బకాయిలు చెల్లించకపోతే, చట్టపరంగా ముందుకు వెళ్తానని కూడా యజమాని హెచ్చరించారు. ఈ ఘటన ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యానికి, నిధుల నిర్వహణలో లోపాలకు అద్దం పడుతోంది. అద్దె బకాయిలు చెల్లించకుండా ఉండటం. అది కూడా ప్రభుత్వ కార్యాలయమే ఇలాంటి పరిస్థితులను సృష్టించడం కాస్త ఆశ్చర్యకరమే అని చెప్పాలి. ఈ సంఘటన వల్ల ప్రజలు తమ పనులు చేసుకోలేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 సీట్లు

మొదటిపేజీ తరువాయి..

పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డ లు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో "వన మహోత్సవం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవాన్ని సీఎం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వేం నరేందర్ రెడ్డి. పీసీసీ ఎఫ్ డా.సువర్ణ, ఇతర అటవీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం అటవీ శాఖ హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సం దర్భంగా మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రకృతిని మనం కాపాడితేనే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. 'వనమే మనం- మనమే వనం' అని పెద్దలు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పుకొచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారనిగుర్తుచేశారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో ఓ మొక్కను నాటాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మీ పిల్లల్లాగే వాటిని సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని ఉద్ఘాటించారు. మహిళలను ప్రోత్సహిస్తూ తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని గుర్తుచేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదని ఆర్టీసీకి



వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని వెల్లడించారు. తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను చూసి మిస్‌వరల్డ్ పోటీదారులు అభినందించారని పేర్కొన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో వెయ్యి బస్సులకు మహిళలు యజమానులు అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. హైటెక్ సిటీ పక్కన మహిళా శక్తి భవన్ నిర్మించామని గుర్తుచేశారు. ఐకేపీ సెంటర్ల ద్వారానే వడ్లు కొనుగోలు జరుగుతోందని తెలిపారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆడబిడ్డలను పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వరకు మంత్రివర్గంలో మహిళలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

# తల తాకట్టు పెట్టైనా హామీలు అమలు చేస్తాం

మొదటిపేజీ తరువాయి..

పంపిణీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలందరికీ ఇళ్లు అందిస్తామని, ఎవరూ నిరుత్సాహ పడవద్దని భరోసా ఇచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని పనులు 18 నెలల తమ ఇందిరమ్మ ప్రభుత్వంలో చేసి చూపుతున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఒక్కో హామీని నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తుంటే.. ప్రతిపక్షాలు ఆరు గ్యారెంటీలపై అనవసరంగా విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాల పంపిణీలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చిందని.. మిగిలిన చోట్ల ఒక్క కార్డు కూడా జారీ చేయలేదని తీవ్రంగా విమర్శించారు. అయితే.. ప్రస్తుత ఇంది రమ్మ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడమే కాకుండా, పేదలందరికీ సన్నబియ్యం అందిస్తోందని.. ఇది ప్రజల దీవె నలతోనే సాధ్యమైందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలు మర్చిపోవద్దని, రాబోయే ఏ ఎన్ని కలు వచ్చినా తమ ప్రభుత్వానికే ప్రజల ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. తమ స్వలాభం కోసం తెలంగాణ రైతుల హక్కులను కాలరాస్తూ.. పక్క రాష్ట్రంతో కుమ్మక్కైంది బీఆర్ ఎస్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని విమర్శించారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును పక్కనపెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చారని..వారి వేసిన పునాదే ఈనాటి బనకచర్ల ప్రాజెక్టు సమస్యలకు కారణమని పేర్కొన్నారు.




# రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదు

మొదటిపేజీ తరువాయి..

లేదంటూ రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని. అందుకే వందనా నీ బొందనా అని తాను స్పందించానని కేటీఆర్ చెప్పారు. ఇది కోతల ప్రభుత్వమంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అభివర్ణించారు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఆ కుర్చీలో కూర్చున్నారంటేనే.. అందుకు కేసీఆరే కారణమన్నారు. కేసీఆర్, టీఆర్ఎస్ లేకపోతే.. గులాబీ జెండా ఎగరకుంటే.. తెలంగాణ వస్తుండేనా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ విషయం రేవంత్ రెడ్డికి తెలియదా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు తాము సైతం అధికారంలో ఉన్నామన్నారు. కానీ తాము ఈ విధంగా ఎగిరెగిరి పడలేదన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ఆరాచకాలను ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణతో పాటు నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. మంత్రి సీతక్క అనుచరుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేశ్ మృతికి నిరసనగా బీఆర్ఎస్ చేస్తున్న శాంతియుత ఆందోళనను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని మండిపడ్డారు. పోలీస్ యాక్ట్ పేరుతో బీఆర్ఎస్ శాంతియుత నిరసనను అడ్డుకున్న ములుగు పోలీసులు, కాంగ్రెస్ నేతల పర్యటనకు మాత్రం పర్మిషన్ ఇవ్వడం చూస్తుంటే కొంతమంది పోలీసులు ఆ పార్టీకి తొత్తుల్లాగా పనిచేస్తున్నారన్న సంగతి అర్థం అవుతుందని కేటీఆర్ అన్నారు. నిన్న అర్ధరాత్రి నుంచే ములుగు నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామాలపై దొంగల లెక్క విరుచుకుపడ్డ పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏం పోలీసింగ్ అని కేటీఆర్ మండిపడ్డారు. ఎవరి ఆదేశాల మేరకు దౌర్జన్యంగా ఇళ్లలోకి దూరి 2 వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారో ములుగు పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కొంతమంది పోలీసులకు న్యాయస్థానాల్లో చివాట్లు పడుతున్నా ఇంకా సోయి రావడం లేదన్ని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసులు రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# సమర్థతకు పరీక్ష..?

మొదటిపేజీ తరువాయి..

ఉప ఎన్నికలు రాజకీయ వేడిని పెంచేస్తున్నాయి. ఉప ఎన్ని కకు ఇంకా సమయం ఉన్నప్పటికీ. పార్టీలు మాత్రం ఇప్పటి నుంచే వ్యూహ ప్రతివ్యూహాలతో సిద్ధం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ బైపోల్స్‌లో ఎవరిని బరిలోకి దిం పాలి అనేదానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. మరోవైపు ఆశా వహులు కూడా తమ సత్తా నిరూపించుకునేందుకు తహ తహలాడుతున్నారు. ఇక జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థిని బరిలోకి దింపాలని చంద్రబాబు కూడా ఫోకస్ పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు త్రిముఖ పోటీలో ఉండగా టీడీపీ కూడా వస్తుందనే ఊహాగానాలతో పోటీ ఇపుడు చతుర్ముఖంగా మారుతుందా అన్న చర్చ మొదలైంది. కానీ పోటీ ఏకపక్షం చేసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నారా లోకేశ్ తో బీఆర్ఎస్ నేత కేటీఆర్ రహస్య మంతనాలు అన్న ప్రచారం ఊపందుకొంది. రాజకీ యలలో శాశ్వత శత్రువులు ఉండరు..శాశ్వత మిత్రులుండ రన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో లోకేశ్ కేటీఆర్ మధ్య చర్చ వార్తలకు బలంచేకూరుతోంది.

ఇదిలావుంటే బీఆర్ఎస్‌నేత మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యం అయింది. దీంతో ఈ స్థానంలో పోటీ చేసి దక్కించుకునేందుకు పార్టీలన్నీ తలమునకలై ఉన్నాయి. అధికార కాంగ్రెస్‌తోపాటు సిట్టిం గ్‌సీటు కోసం బీఆర్ఎస్ ఇంకోవైపు బీజేపీ కూడా జూబ్లీ హిల్స్ బైపోల్స్‌పై దృష్టిసారించాయి. ఏ అభ్యర్థిని రంగంలోకి దించాలి. గెలిచేందుకు ఎలాంటి వ్యూహాలతో ముందుకెళ్లాలి అని తర్జనభర్జన పడుతున్నాయి. ఇక ఈ సీటు కోసం ఆశా వహుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతుండటం పార్టీలకు కూడా ఈ వ్యవహారం తలనొప్పిగా మారుతోంది. ఇలాంటి తరుణంలోనే టీడీపీ కూడా జూబ్లీహిల్స్ స్థానంలో బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు వార్తలు రావడంతో తెలంగాణలోని తెలుగు తమ్ముళ్లలో జోష్ నెలకొంది. అయితే టీడీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందా లేక పొత్తు పెట్టుకుం టుందా అనే చర్చ జరుగుతోంది.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చాలా ప్రతిష్ఠాత్మకంగా నిలవనుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్లు కావస్తున్న వేళ.. ఈ బైపోల్స్ ప్రభుత్వ పనితీరును అంచనా వేస్తుందని రాజకీయ విశ్లేష కులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన వేళ.. రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఈ ఉపఎన్నిక మరింత కీల కంగా మారింది. దీంతో ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి కఠిన పరీక్షగా నిలవనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఈ జూబ్లీహిల్స్ బైపోల్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఈ స్థానాన్ని కోల్పోయిన హస్తం పార్టీ ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎక్కువ ఓట్లను దక్కించుకోగలిగింది. ఇదే ఆ పార్టీకి ఆత్మవిశ్వాసాన్నిస్తోంది. ఇక హైకమాండ్ కూడా జూబ్లీహిల్స్ సీటును గెలుచుకోవాలని.. పార్టీ శ్రేణులకు ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల తెలంగాణ పర్యటనకు వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఇదే విషయాన్ని స్పష్టం చేసి నట్లు తెలుస్తోంది. మరోవైపు.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇం ఛార్జ మీనాక్షి నటరాజన్ కూడాజూబ్లీహిల్స్‌లో హస్తం జెండా ఎగరాలని తేల్చి చెప్పారు. మరోవైపు.. తమ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణించడంతో రానున్న ఉపఎన్నికలో మళ్లీ సీటును నిలబెట్టుకోవాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావి స్తోంది. సిట్టింగ్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోకూడ దని గట్టి పట్టుదలతో ఉంది. అయితే మాగంటి గోపీనాథ్ కుటుంబానికే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ టికెట్ దక్కుతుందని ఆయన సోదరుడు వజ్రనాథ్ తెలిపారు. మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభ సందర్భంగా ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దల దృష్టికి తీసుకువెళ్లినట్లు వజ్రనాథ్ వివరించారు. దీనిపై.. కేసీఆర్, కేటీఆర్ తుది నిర్ణయం తీసుకుంటారని.. వారు ఎవరికి టికెట్ ఇచ్చినా.. వారిని గెలిపించేందుకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ బైపోల్స్ టికెట్ మాగంటి గోపీనాథ్ భార్య లేదా ఆయన సోదరుడు వజ్రనాథ్‌కు దక్కే అవకాశాలు ఉన్నట్లు గులాబీ శ్రేణుల్లో జోరుగా చర్చ జరుగుతోంది. మరి పార్టీ హైకమాండ్ ఆ దిశగా నిర్ణయం తీసుకుంటుందా లేక ఇంకో వ్యక్తిని బరిలోకి దింపుతుందా అనేది వేచి చూడాల్సిందే.

ఇదిలావుంటే అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు పోటీగా బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ స్థానంలో పాగా వేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇటీవలె తెలంగాణకు కొత్త బీజేపీ అధ్యక్షుడిగా.. మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన నాయకత్వానికి ఇది తొలి పరీక్ష కానుంది. సరైన అభ్యర్థి కోసం కాషాయదళం కూడా గాలింపు చేపట్టింది. అయితే బీజేపీ తరపున జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థిని ఇంకా నిర్ణయించలేదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే పార్టీలోని పలువురు ఆశావహులు జూబ్లీహిల్స్ టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇదిలావుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గత జరిగిన 3 అసెంబ్లీ ఎన్నికల్లో (2014, 2018, 2023) జూబ్లీహిల్స్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన. మాగంటి గోపీనాథ్ ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత జరిగిన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన మాగంటి గోపీనాథ్ 80,175 ఓట్లతో గెలుపొందారు. దీంతో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ జూబ్లీహిల్స్ బైపోల్స్‌పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో టీడీపీకి కొంత బలం ఉండటంతో పార్టీకి పునర్వైభవం తీసుకురావాలని భావిస్తున్న చంద్రబాబు ఈ ఎన్నికల్లో నందమూరి సుహాసినిని తెరపైకి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ ఒంటరిగా పోటీ చేస్తుందా లేక ఇతర పార్టీలతో కలిసి బరిలోకి దిగుతుందా అనేది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఓట్లు చీలి కాంగ్రెస్ గెలవకుండా చేసేందుకే నారా లోకేశ్ తో కేటీఆర్ మంతనాలు సాగించే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం ఊపందుకొంది. ఇలా అన్ని పార్టీలు ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడనప్పటికీ అభ్యర్థుల ఎంపిక, గెలుపు వ్యూహాలపై ఇప్పటికే దృష్టి సారించాయి. దీంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠను రేపడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కేవలం ఒక స్థానం మాత్రమే అయినా.. దీని ఫలితం ప్రభావం రాష్ట్రంలో ఏ పార్టీ బలం ఎంత ఉందో తెలపనుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం మారిన తర్వాత సరిగ్గా 2 ఏళ్లకు జరిగే ఈ ఉపఎన్నికపై అందరి దృష్టి పడింది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఎక్కువైందని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు పదే పదే విమర్శలు చేస్తున్న వేళ.. ఈ బైపోల్స్ రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఒక అగ్నిపరీక్షలాగా మారింది. అదే సమయంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్న వేళ.. సిట్టింగ్ సీటును కోల్పోకుండా గెలిచి.. తమ పార్టీ బలంగానే ఉందని చాటిచెప్పాల్సిన అవసరం బీఆర్ఎస్‌కు ఉంది. ఇక బీజేపీ కూడా హైదరాబాద్‌లో తమ ఉనికిని చాటుకోవాలనే లక్ష్యంతో పోటీకి సిద్ధమైంది.

iLovePDF





# ఎవరిని అడిగి చెప్పాలి పెద్దాయన నీ గురించి?

ఆగిపోకుండా కొట్టుకుంటున్న పేదోడి గుండె నడగాలా?
పెద్ద చదువులు చదివి, పెద్ద
ఉద్యోగాలు చేస్తున్న పేదోడి బిడ్డలనడగాలా?
జలజలా నీటిని పారించే ప్రాజెక్టుల గేటులనడగాలా?
ఉచిత విద్యుత్ తో నడిచే, చేనులోని పంపుషెడ్డునడగాలా?
కుయ్ కుయ్ కుయ్ మని అరిచే
108, 104 అంబులెన్సుల సౌండునడగాలా?
ఎవరిని అడగమని చెబుతావ్?
ఎవరికి తెలీదు పెద్దాయన నీగురించి?
నిన్ను తన గర్భంలో దాచుకున్న,
నల్లమల్ల అడవికి కూడా నీ గురించి
తెలుసుంటదిలే పెద్దాయన?
అందుకే నేను పచ్చగా ఉండాలంటే,
నువ్వు తన గర్భంలోనే
ఉండాలనుకుంది కాబోలు?
అందుకే నిన్ను మానుండి దూరం చేసి,
పచ్చని ప్రకృతిలో కలుపుకుంది.
పేదలకోసం పరితపించిన మనిషివి,
నువ్వు ప్రతిపేదోడి గుండెల్లో బతికున్న అమరుడివి,
నీకు జయంతి అనడం కూడ నాకిష్టం లేదు పెద్దాయనా.
ఇంకో కొత్త పదం కనిపెట్టి,
మీకు నివాళులు అర్పించాలని ఉంది రాజన్నా.






నేటి ప్రభాత సూర్య - తెలంగాణ డెస్క్:

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- యూరియా సరఫరాకై కేంద్రానికి వినతి
- రాష్ట్రానికి పెట్టుబడుల ఆహ్వానం
- హీరో అజయ్ దేవగన్.. కపిల్ దేవ్ తోనూ సీఎం భేటీ
- అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై చర్చ

(నేటి ప్రభాత సూర్య-న్యూఢిల్లీ బ్యూరో)

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం నాడు మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకొన్నారు. రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి ఢిల్లీలోనే ఉండనున్నారు. పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30కి కేంద్ర క్రీడలు, కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ రాష్టానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సీఎం చర్చించారు. కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిసి మాట్లాడారు. రాష్ట్రానికి యూరియా కోటా పెంచాలని కోరనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. అలాగే బనకచర్ల అంశంపై మరోసారి కేంద్రమంత్రిని కలిసి చర్చించనున్నారు. ఇప్పటికే బనకచర్ల అనుమతులని పర్యావరణ కమిటీ నిరాకరించింది. మరోసారి బనకచర్ల ప్రాజెక్ట్‌ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న నిధులపై కేంద్రమంత్రులను కలవనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో నిధుల ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచనున్నారు. 42 శాతం రిజర్వేషన్ ఆమోదంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సీఎం చర్చించనున్నారు. విభజన సమస్యల పరిష్కారానికి ఢిల్లీ పెద్దలతో భేటీ కానున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. మరోవైపు తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ తో ఫిల్మ్ సిటీ ఏర్పాటుపై చర్చించారు. అత్యాధునిక ఏఐ, వీఎఫ్ఎక్స్ స్టూడియోల ఏర్పాటుకు అజయ్ ఆసక్తి చూపారు. కపిల్ దేవ్ తో కలిసి హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం చర్చించారు. ఈ రెండు ప్రాజెక్టులు తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు. ఇదిలావుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి నూతన అవకాశాలను కల్పిస్తోంది. కేంద్ర మంత్రులతో వరుస భేటీలు ముగిసిన అనంతరం.. ఆయన తమ నివాసంలో పలువురు సినీ, క్రీడా రంగ ప్రముఖులతో చర్చలు జరిపారు. ఈ సమావేశాలు తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, వినూత్న ప్రాజెక్టులకు మార్గం సుగమం చేసే దిశగా సాగాయి. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ , భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్‌లతో జరిగిన చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో జరిగిన భేటీలో బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్, తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ సిటీ ఏర్పాటుపై తనకున్న ఆసక్తిని వెలిబుచ్చారు. ఈ ఫిల్మ్ సిటీలో అత్యాధునిక ఏఐ-ఆధారిత విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్) , స్మార్ట్ స్టూడియోలు స్థాపించే అంశంపై విస్తృతంగా చర్చించారు. దీంతో పాటు.. ఒక సమగ్రమైన ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ఆయన సమర్పించినట్లు సమాచారం.

ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే, అది తెలంగాణలోని సినీ పరిశ్రమకు ఒక నూతన శకాన్ని ఆరంభిస్తుంది. స్థానిక కళాకారులకు, సాంకేతిక నిపుణులకు విస్తృత అవకాశాలు లభించడంతో పాటు, అంతర్జాతీయ స్థాయి నిర్మాణాలకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశం ఉంది. ఏఐ, వీఎఫ్ఎక్స్ సాంకేతికతల జోడింపుతో తెలుగు సినిమా ప్రపంచ పటంలో మరింత ఉన్నత స్థానానికి చేరుకునే వీలు కలుగుతుంది. ఇదిసినిమా రంగానికే కాకుండా, అనుబంధ పరిశ్రమలకు కూడా భారీ ప్రోత్సాహాన్ని అందిస్తుంది.



మరోవైపు.. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ముఖ్యమంత్రిని కలిసి హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రణాళికలపై చర్చించారు. క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి, యువ క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణను అందించడానికి ఈ విశ్వవిద్యాలయం ఎంతగానో దోహదపడుతుందని ఇరువురు అభిప్రాయపడ్డారు. కపిల్ దేవ్ వంటి క్రీడా దిగ్గజం భాగస్వామ్యం తెలంగాణలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి, భవిష్యత్ ఒలింపియన్లను, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడానికి కీలకం అవుతుంది. ఈ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడా సైన్స్, ఫిట్‌నెస్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉన్నత విద్యను అందించే అవకాశం లభిస్తుంది. ఈ భేటీలు తెలంగాణలో పెట్టుబడుల వాతావరణాన్ని, అభివృద్ధి అవకాశాలను మరింత బలోపేతం చేస్తాయని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. సినిమా, క్రీడా రంగాల్లో రాష్ట్రానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకురావడమే కాకుండా, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు. ఈ కీలక చర్చల ఫలితాలు, వాటి కార్యాచరణ ప్రణాళికలు త్వరలోనే వెల్లడికానున్నాయి. తెలంగాణ భవిష్యత్తుకు ఈ పరిణామాలు ఎంతగా దోహదపడతాయో చూడాలి

# అక్బరుద్దీన్‌కు హైడ్రా మినహాయింపులా?

**బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు విమర్శలు**



**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :** పాతనగరరోని సల్కం చెరువు భూమిలో మజ్లిస్ పార్టీ శాసనసభాపక్షం నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ అక్రమంగా నిర్మించిన కళాశాల భవనానికి హైడ్రా మినహాయింపు ఇచ్చిందా?అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ప్రశ్నించారు. అక్బరుద్దీన్ ఒక న్యాయం పేదలకు మరో న్యాయమా? అని ఆయన సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్బరుద్దీన్ కళాశాల నిర్మించిన విషయం వాస్తవమేనని, అయితే అందులో పది వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నందున వారి జీవితాలను నాశనం చేయలేమని ప్రభుత్వం చెప్పడం విస్మయం కలిగిస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వేలాది మంది పేదలు, చెరువు శిఖం భూములను పేద, మధ్య తరగతి ప్రజలు సంపాదించిందంతా పోసి ఖరీదు చేస్తే, వారి ఇండ్లను ఎందుకు కూల్చి వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం, ఇతరులకు మరో న్యాయమా? అని ఆయన ప్రశ్నించారు. ఇదేనా మీ ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ మార్క్ పాలన అని ఆయన ప్రశ్నించారు. చెరువు భూమిలో భవనాన్ని నిర్మించినందున వేరే భవనానికి కళాశాలను మార్చుకోవాలని సూచన ఎందుకు చేయలేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా అధికారులు అక్బరుద్దీన్ అక్రమ భవనాన్ని కూల్చేందుకు రంగంలోకి ఎందుకు దిగడం లేదని ఆయన నిలదీశారు. అందరికీ ఒకే న్యాయం అందిస్తే అక్బరుద్దీన్‌కు చెందిన కళాశాల భవనాన్ని ఎందుకు కూల్చడం లేదని ఆయన ప్రశ్నించారు. అక్బరుద్దీన్ ప్రభుత్వ భూములు కబ్జా చేసినా, అనుచరులు దాదాగిరి చేసినా, చివరకు విద్యుత్తు బిల్లులు చెల్లించకపోయినా, తీవ్రవాదులకు ఆశ్రయం ఇచ్చినా ప్రభుత్వం ఎందుకు చర్య తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే తామే రంగంలోకి దిగి కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. మీడియా సంస్థలపై బిఆర్ఎస్ దాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వెంటనే దాడులు నిలిపి వేయాలని, ప్రభుత్వం కూడా ఈ విషయంలో కఠినంగా ఉండాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# మహిళలకు రేవంత్ సర్కార్ మరో వరం

**ఆ పథకం గడువు పొడగింపు**

(నేటి ప్రభాత సూర్య-జనరల్ బ్యూరో)



తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్ హెచ్ జీ) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. వారికి అందించే ప్రమాద బీమా పథకాన్ని 2029 సంవత్సరం వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద బీమా పథకం ప్రకారం.. ఏదైనా ప్రమాదవశాత్తు ఎస్ హెచ్ జీ సభ్యులు మరణిస్తే, వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం లభిస్తుంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 409 మంది కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించారు. ప్రభుత్వం అందించిన ఈ వెసులుబాటు, ఆర్థిక భద్రత కారణంగా మహిళలు స్వయం సహాయక బృందాల్లో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇప్పటి వరకు 1.67 లక్షల మంది కొత్త సభ్యులు ఈ బృందాల్లో చేరారు. సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ కొత్త జీవోను విడుదల చేసింది. మహిళా స్వయం సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. ఈ బృందాల ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడంతో పాటు.. చిన్న తరహా పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. అయితే.. అనేక సందర్భాల్లో దురదృష్టవశాత్తు జరిగే ప్రమాదాలు వారి జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం పొడిగింపు ద్వారా భవిష్యత్తులో కూడా ఎస్ హెచ్ జీ సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది. ఇది మహిళలు మరింత ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తమ ఆర్థిక కార్యకలాపాలను కొనసాగించడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది. పథకం మహిళా సాధికారతకు, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడంలో సందేహం లేదు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు. దీని ద్వారా వారికి ఎలాంటి దురదృష్టకర సంఘటన జరిగినా.. వారి కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకోకుండా కొంతమేర రక్షణ లభిస్తుంది.

# ఆగమైన శాఖలన్నీ నాకే ఇచ్చారు


- శాఖల కేటాయింపు పై మరో మంత్రి అసంతృప్తి
- నాడు కొండ సురేఖ... ఇప్పుడు వాకిటి శ్రీహరి

(నేటి ప్రభాత సూర్య - పొలిటికల్ బ్యూరో)

తెలంగాణ రాష్ట్ర మంత్రులకు శాఖల కేటాయింపుల పట్ల బహిరంగ అసంతృప్తి వ్యక్తం అవుతుంది. మొన్నటికి మొన్న కొండా సురేఖ కు కేటాయించిన శాఖలపై అసంతృప్తి వ్యక్తం చేయగా.. తాజాగా వాకాటి శ్రీహరి అదే బాటలో నడుస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినా..తెలంగాణలో దాదాపు పదేళ్ల అధికారం అందుకోలేకపోయింది కాంగ్రెస్ పార్టీ. అలాంటి ఏడాదిన్నర కిందట జరిగిన ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, అప్పటినుంచి మంత్రివర్గ విస్తరణ లేదు. ఇప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి వంటి కీలక జిల్లాలకు, నిజామాబాద్ జిల్లాకు మంత్రి పదవులు దక్కనేలేదు. ఆదిలాబాద్ జిల్లాకు ఎట్టకేలకు ఇటీవలి విస్తరణలో చోటు లభించింది. కాగా, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రేవంత్ ముఖ్యమంత్రిగా ఉండగా.. అదే జిల్లా నుంచి జూపల్లి కృష్ణారావు మంత్రి పదవి పొందారు. తాజా విస్తరణలో మక్తల్ ఎమ్మెల్యే అయిన వాకిటి శ్రీహరికీ అమాత్య యోగం దక్కింది. శ్రీహరి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అయినప్పటికీ ఆయన మంత్రి పదవి పొందారు. వాస్తవానికి శ్రీహరి క్యాబినెట్‌లో చోటు ఖాయమని మొదటినుంచి రేవంత్ చెబుతున్నారు. ఈ మాటను నిలబెట్టుకుంటూ చోటు కల్పించారు. ఆయనకు పశు సంవర్ధక, మత్స్యశాఖ, యువజన సర్వీసుల పోర్ట్‌ఫోలియో ఇచ్చారు. కానీ, తనకు కేటాయించిన ఈ శాఖలపై మంత్రి వాకిటి శ్రీహరి అంత సంతృప్తిగా ఉన్నట్లు లేరు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. పదేళ్లలో (బీఆర్ఎస్ హయాంలో) ఆగం అయిన శాఖలను తనకు ఇచ్చారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీహరికి ఐదు శాఖలు ఇవ్వగా అన్నీ ఇలానే ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇది అదృష్టమో, దురదృష్టమో తెలియదని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ గందరగోళం.. గొర్రెలు, బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలని అని అన్నారు. యువజన సర్వీసులు ఇస్తే ఏం చేసుకోవాలి? అని పేర్కొన్నారు. శ్రీహరి ఉద్దేశం తనకు వచ్చిన శాఖలు వివాదాలు ఉన్నవి, ఉపయోగం లేనివి అన్నట్లు ఉంది. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశిస్తూ.. పొన్నం అన్ననే న్యాయం చెప్పాలని కూడా కోరారు. బీఆర్ఎస్ హయాంలో పశు సంవర్ధక శాఖలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. గొర్రెల పెంపకం పథకంపై పెద్దెత్తున విమర్శలు వచ్చాయి. మత్స్య శాఖలో చేప పిల్లల పంపిణీ వంటి కార్యక్రమం చేపట్టినా అదీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు తావిచ్చింది. యువజన శాఖ పనితీరు కూడా సరిగా లేదనేవారు. కాగా, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్-మత్స్యశాఖ, క్రీడా-యువజన శాఖలను చూస్తున్న శ్రీహరి అందుకనే తన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణ ప్రభుత్వ ప్రాధామ్యాల ప్రకారం యువజన శాఖ మంచిదే. సీఎం రేవంత్ యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్‌తో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మరి మంత్రి శ్రీహరి ఆవేదన ముమ్ముందు చల్లారుతుందేమో చూద్దాం.

# ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జీలు నియామకం

**పేర్లు ప్రకటించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**



**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :** సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇంఛార్జ్‌లను టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. సోమవారం జిల్లా ఇంఛార్జ్‌లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్,10 ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి విధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని ఏఐసీసీ ఇంఛార్జ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీ-పీసీసీ చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్‌లను టీ-పీసీసీ చీఫ్ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల ఇంఛార్జ్‌లుగా వంశీచంద్ రెడ్డి - ఖమ్మం, సంపత్ కుమార్ - నల్లగొండ, అడ్లూరి లక్ష్మణ్ - వరంగల్, పొన్నం ప్రభాకర్ - మెదక్, జగ్గారెడ్డి - హైదరాబాద్, కుసుమ కుమార్ - మహబూబ్ నగర్, అనీల్ యాదవ్ - ఆదిలాబాద్, అద్దంకి దయాకర్ - కరీంనగర్, అజ్మతుల్లా హుస్సేన్ - నిజామాబాద్‌కు నియమితులయ్యారు.

# పేదల సంక్షేమం లక్ష్యంగా పథకాలు

- పదేళ్లలో పేదలను విస్మరించిన కెసిఆర్
- సొంత ప్రయోజనాలు కాపాడుకున్న నేత
- జుక్కల్ పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి



**నిజామాబాద్- నేటి ప్రభాత సూర్య:** తెలంగాణ లో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ పథకాలు పేదలకు చేరడంతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. గతంలో లాగా కాకుండా పేదలకు నేరుగా పథకాలు అందుతున్నాయని అన్నారు. నిజామాబాద్ జిల్లా కామారెడ్డి జుక్కల్ నియోజక వర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..పక్కనే కేసీఆర్ ఫార్మ్ హౌస్ ఉన్నా ఈ ప్రాంతం అభివృద్ధి జరగలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూంలు..దళితుణ్ణి సీఎం చేస్తానని నమ్మించి కేసీఆర్ పదేళ్లు మోసం చేశారని ఫైర్ అయ్యారు. సొంత కుటుంబం బాగు చూసుకున్న కెసిఆర్, ప్రజల బాగోగులను విస్మరించారని అన్నారు. ఉద్యోగాలు ఇస్తానన్న కేసీఆర్ గత పదేళ్లు.. తన కుటుంబ సభ్యులకు మాత్రమే కొలువులు ఇచ్చుకున్నారని అన్నారు. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సంవత్సరంలోపే 60 వేల ఉద్యోగాలు ఇచ్చింది. రానున్న రెండేళ్లలో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తాం. తెలంగాణ స్కింలు దేశానికి ఆదర్శం. హరీష్ రావువి తప్పుడు ప్రచారాలు. ఇది పేదల ప్రభుత్వం అన్నారు. వెనుకబడ్డ జుక్కల్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తాం. జుక్కల్ నియోజక వర్గంలో రూ.165 కోట్లతో పూర్తి స్థాయి రోడ్లు నిర్మిస్తాం. వెనుకబడ్డ జుక్కల్ నియోజక వర్గం అభివృద్ధి అయితేనే నిజమైన అభివృద్ధి జరిగినట్లు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భాగోలేకపోయినా అభివృద్ధి పనులు చేస్తున్నాం. విద్యా, వైద్యంపై దృష్టిపెట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుంది. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ సహకారంతో లెండి, నాగమడుగు ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తాం. 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా ఇచ్చాం. నియోజక వర్గంలో వారం రోజుల్లో రూ. 20 కోట్ల వ్యయంతో 6 సబ్ స్టేషన్లు మంజూరు చేస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ నేతలు విమర్శలుమానాలని లేకుంటే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. అదేపనిగా విమర్శలు చేస్తే వారి అరాచకాలు ప్రజలు మరచిపోరని అన్నారు. అందుకే వారు ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్నారు. వివిధ స్కామ్‌లు చేసి ప్రజలను, తెలంగాణను దగా చేశారని అన్నారు.

iLovePDF



# సంపాదకీయం

## మొక్కల పెంపకం మన బాధ్యత కాదా ?

మొక్కలు నాటడం, సంరక్షించడం నిత్యకృత్యంగా కావాల్సిన కార్యక్రమాన్ని ప్రజలు మరిచి పోయారు. గతంలో చెరువుల,పొలంగట్లు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం విధిగా భావించేవారు. రైతులు నిత్యం ఏదో ఒక మొక్కను నాటుతూ పచ్చదనానికి పాటుపడేవారు. కానీ కాలం మారింది. ప్రజల జీవన విధానం మారింది. దీంతో పర్యావరణ రక్షణకు అవసరమైన మొక్కలను పెంచడం మానేశారు. దీనికితోడు వెనకటికి పెంచిన మొక్కలను తెగనమ్ముతున్నారు. దీంతో గ్రామాలన్నీ ఎడారులుగా మారుతున్నాయి. మొక్కలు పెంచడం కూడా ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా తయారయ్యింది. ఇందులో తమ ప్రమేయం లేదన్నట్లుగా ప్రజలు మిన్నకుండిపోతున్నారు. వాతవరణ ప్రతికూలతలు అనుభవంలోకి వస్తున్నా.. మొక్కలను పెంచడం, చెరువులను సంరక్షించడం వంటి పనులు మానేశారు. సముద్రతీరంలో ఉండే మడ అడవులను కూడా ధ్వంసం చేసిన చరిత్రకొందరిది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మొక్కల పెంపకంపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. అడవుల నరికివేత కారణంగా గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మొక్కలు పెంచితే కొతులు వస్తాయని కొత్త సిద్దాంతం ఇప్పుడు వల్లె వేస్తున్నారు. దీంతో పొలంగట్ల వద్ద కూడా ఉన్నచెట్లు మాయం అవుతున్నాయి. అడవులతో పాటు, కొండలు,గుట్టలను కూడా నేలమట్టం చేసేస్తున్నారు. దీంతో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ కక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం సోమవారం నుంచి మొదలు అయ్యింది.


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో అధికారికంగా ప్రారంభించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ హరితహారం విరివిగా చేపట్టారు. ఎవు కార్యక్రమం చేపట్టినా మార్పు రావడం లేదు. ఎందుకంటే ఉద్యమంగా మొక్కల పెంపకం సాగితే తప్ప మార్పు కనిపించదు. ఇకపోతే వన మహోత్సవానికి అటవీశాఖ అధికారులు నెల రోజుల నుంచి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇతర శాఖల ఉన్నతాధికారుల సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందించారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మొక్కలు నాటే నాటేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాదిలో వనమహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 18.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా నాటిన ప్రతి మొక్కను బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముందస్తు ప్రణాళికలు తయారు చేశారు.

ముఖ్యంగా నాటిన మొక్కలకు నీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భావిస్తున్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటేవారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా వేప, తుమ్మ, మామిడి, మర్రి,రావి ఈత వంటి చెట్లు ఎక్కడపడితే అక్కడ దర్శనం ఇచ్చేవి. కానీ కాలక్రమంలో ఉన్నవి నరికివేయగా, కొత్తగా మొక్కలునాటే పద్దతని ప్రజలు మరచిపోయారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో అను వృక్ష జాతులకు చోటు లేకుండా చేశాయి. కలుపు మొక్కలు, విదేశీ జాతులను తొలగించి, కొత్తగా మళ్లీ మన నేలలలకు అనువైన మనజాతి మొక్కలను నాటాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంప్రదాయ స్థానిక మొక్కలను పునరుద్ధరించడానికి, బదులు ఏటా నిర్లక్ష్యం చేస్తున్నారు. కలప, అటవీ పండ్లు, అటవీ పూల జాతులు, వివిధ రకాల వెదురు జాతులను నాటాలని ప్రణాళిక రూపొందించినా అమలు కావడం లేదు. ఇకపోతే తెలంగాణలో రైతులకు వ్యక్తిగత ఆదాయానిచ్చే పండ్ల మొక్కలు పెద్ద ఎత్తున నాటేందుకు పంపిణీ చేస్తున్నారు. ఇంటి ఆవరణంలో పెంచే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రధానంగా పండ్ల మొక్కలను ఎక్కువగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పూల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోనున్నారు.

జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటే లక్ష్యం పూర్తి చేస్తేనే, వర్షాకాలం పూర్తయ్యేనాటికి నాటిన మొక్కలు దాదాపు 90 శాతంకు పైగా బతుకుతాయని అటవీ అధికారులు అంచన వేస్తున్నారు. ఈ సారి వంద శాతం మొక్కలు నాటాలని టార్గెట్ పెట్టుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నాటే మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి నాటకుండా అదే గ్రామంలో వన నర్సరీల ద్వారా పెంచిన మొక్కలు నాటే అలవాటును ప్రజల్లో ప్రోత్సహించడం అవసరం. మొక్కలు నాటే కార్యక్రమం, వాటిని పెంచేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులను భాగస్వాములుగా కాలవాల్సి ఉంది. ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ఇంటి పేరట్లో గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు- పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను పంపిణీ చేసి ప్రజలు పెంచేలా చేయాలి. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు-, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు- పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో విరివిగా నాటాలి. ముఖ్యంగా విద్యార్థులను మొక్కలు నాటేలా కార్యక్రమం చేపట్టాలి. ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటిం చేందుకు ఏటా చర్యలు చేపట్టాలి. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయవచ్చు.

ఇకపోతే తెలంగాణలో వనమహోత్సవంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఇతర శాఖల కంటే ఎక్కువ మొక్కలు నాటనుంది. ఈ శాఖ పరిధిలో 7 కోట్ల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 2.30 కోట్ల మొక్కలు నాటేందుకు కావాల్సిన గుంతలను సిద్ధం చేసి ఉంచారు. ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఆగస్టు చివరి నాటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ సారి తాటి, ఈత మొక్కలు నాటేందుకు పెద్దపీట వేశారు. అత్యధికంగా ఈ సంవత్సరం 25 లక్షల మొక్కలు తాటి, ఈత మొక్కలు నాటనున్నారు. అంతే కాకుండా రైతులకు వ్యక్తి గతంగా ఆదాయాన్ని సమకూర్చే పండ్లతోటల మొక్కలు నాటేందుకు తొలి ప్రాధన్యత కల్పించారు. 22 వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు పెంచనున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు గ్రామాల వారీగా కార్యక్రమలు చేపడితే మంచి ఫలితం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇందుకు కార్యచారణతో ముందుకు సాగాలి.

## ఆధ్యాత్మికం



## మంచీచెడుల విశ్లేషణ


**తిరుమల- నేటి ప్రభాత సూర్య :**

జీవితం అంటేనే మంచిచెడుల కలయిక. మంచిని ఎంచుకుంటే సుఖయంగా, చెడును ఆచరిస్తే కష్టాలమయంగా మారుతుంది. దీనికి ఎవరినో అడగాల్సిన పనిలేదు. మన మనసే ఏది మంచో ఏది చెడో ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉంటుంది. మనుషుల్లో మనకు ఇద్దరు కనిపిస్తారు. ఒక్క మనిషిలో ఇద్దరా... ఎలా? అవును. ఆ ఇద్దరిలో ఒకడు మంచివైపు లాగుతుంటాడు. మరొకడు చెడువైపు లాగుతుంటాడు. ఆ ఇద్దరు మనుషులకు ప్రతీకలే ఈ మంచి, చెడులు. మనిషి జ్ఞానాన్ని ఆర్జించినప్పుడు, మనసులోని చెడును బయటికి తరిమేసే అవకాశం కలుగుతుంది. అజ్ఞాని అయినవాడి ప్రవృత్తి ద్వంద్వంగా కొనసాగుతుంటుంది. అతడి ఆలోచనా విధానం అస్తవ్యస్తంగా ఉంటుంది. పరిణతి పొందని మనసు ఏదో ఆలోచిస్తూంటుంది. పైకి మాట తీరు మరోలా ఉంటుంది. ఆంతర్యంలోని ఆలోచనకు, మాటకు పొంతన ఉండదు. పైకి అతి వినయం చూపించేవాడి లోపల ధూర్తుడు తిష్ఠవేసుక్కూర్చుంటాడు. కామ క్రోధాల్లో ఏదో ఒకటి అతణ్ని ఆడిస్తూనే ఉంటుంది. అటువంటి వాణ్ని లోకం ఓసారి నమ్మినా రెండోసారి నమ్మదు. అందువల్ల మంచీ చెడులను మనమే విశ్లేషించుకునే అవకాశం భగవంతుడు ఇచ్చాడు. దానిని తర్కించుకునే అవసరం ఉంది. అప్పుడే మంచివైపు అడుగువేయ గలుగుతాం.

# మరోమారు ట్రంప్ సుంకాల హెచ్చరిక

- బ్రిక్స్ దేశాలపై అదనంగా పదిశాతం విధింపు

**నేటి ప్రభాత సూర్య - ఇంటర్‌నెట్ డెస్క్:**



వాణిజ్య సుంకాల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక ప్రకటన చేశారు. బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనపు టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు. ఈమేరకు తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10శాతం టారిఫ్‌లు విధిస్తాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు అని ట్రంప్ స్పష్టంచేశారు. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక విధానాలతో జతకట్టే దేశాలపై అదనంగా 10శాతం సుంకం విధించనున్నట్లు- ట్రంప్ ప్రకటించాడు. అమెరికన్ వ్యతిరేక విధానాలతో జతకట్టే ఏ దేశానికైనా అదనంగా 10శాతం సుంకం విధించబడుతుంది. ఈ విధానానికి ఎటువంటి మినహాయింపులు ఉండవని ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్న ట్రంప్ అమెరికన్ వ్యతిరేక విధానాలు ఏమిటన్నవి వివరించలేదు. బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా మరియు దక్షిణాఫ్రికాలు 17వ బ్రిక్స్ సమ్మిట్‌లో దాని సభ్యులు, భాగస్వాములు మరియు అవుట్‌రీచ్ ఆహ్వానితులు పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విచక్షణారహిత దిగుమతి సుంకాలను బ్రిక్స్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిక్స్ కూటమి 2009లో జరిగిన దాని మొదటి శిఖరాగ్ర సమావేశంలో బ్రెజిల్, రష్యా, భారతదేశం మరియు చైనాలు న్నాయి. తరువాత ఈ కూటమి దక్షిణాఫ్రికాను చేర్చుకుంది. గత సంవత్సరం ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియాలను సభ్యులుగా చేర్చింది. బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతున్నవేళ ట్రంప్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. రియో డి జనీరో నగరంలో ఈ సదస్సు ప్రారంభమైంది. ఇందులో భారత ప్రధాని మోదీ సహా పలువురు దేశాధినేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు అమెరికా విధానాలను ఉద్దేశిస్తూ సుంకాల అంశాన్ని వారు ప్రస్తావించి నట్లు వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలోనే ట్రంప్ స్పందించినట్లు తెలుస్తోంది. మరోవైపు, ప్రపంచ దేశాలతో ట్రేడ్ డీల్స్ అంశం పైనా ట్రంప్ పోస్ట్ చేశారు. వాణిజ్య చర్చలకు సంబంధించి సోమవారం నుంచి పలు దేశాలకు లేఖలు పంపించనున్నట్లు- తెలిపారు. కొత్త టారిఫ్‌లు, అమలు తేదీని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు- వెల్లడించారు. మరోవైపు, ఈ నూతన వాణిజ్య సుంకాల తాత్కాలిక నిలిపివేతను అగ్రరాజ్యం మరికొన్ని రోజులు పొడిగించింది. తొలుత జులై 9 డెడ్‌లైన్ ఉండగా.. తాజాగా ఆగస్టు 1 నుంచి నూతన టారిఫ్‌లను అమలుచేయనుంది. ఈమేరకు అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ ధ్రువీకరించారు. దీంతో అగ్రం రాజ్యంతో వాణిజ్య చర్చల కోసం ఇతర దేశాలకు మరింత సమయం లభించినట్లయ్యింది. ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య ఒప్పందాలను నిర్ణయించే పనిలో నిమగ్నమై ఉన్నారు. అందువల్ల కొత్త టారిఫ్‌లు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లుట్నిక్ వెల్లడించారు.

# అటవీ సంపద పునరుద్ధరణ

- ప్రతి ఒక్కరూ కనీసం 20 మొక్కలు నాటాలి
- అప్పుడే లక్ష్యం చేరుకోగలం

**నిజామాబాద్- నేటి ప్రభాత సూర్య :**



రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. కామారెడ్డి జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది.టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మాత్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.


# గ్రామాల్లో పచ్చదనం నెలకొనాలి

వనమహోత్సవంలో అంతా పాల్గొనాలి

**కామారెడ్డి- నేటి ప్రభాత సూర్య :**



వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. పర్యావరణ హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలన్నారు. ఇది లాభాపేక్షలేని కార్యక్రమంగా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పదికాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరా రు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చద నం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. 56 కి.మీ పొడవున్న నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు. ఇకపోతే ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నార న్నారు. ప్రతీ గ్రామంలో ఈజీఎస్ అధికారులతో నర్సరీలు ఏర్పాటుచేసేలా, ప్రతీ గ్రామంలో స్థలాలను ఎంపిక చేస్తున్నామన్నారు.



## గ్రూప్-1పై వాదనలు పూర్తి

**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణ గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. సుదీర్ఘ వాదనల అనంతరం న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మెయిన్స్ పత్రాలు పునఃమూల్యాంకనం చేయాలని పిటిషనర్లు కోరారు. లేదంటే మళ్లీ పరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు గతంలో గ్రూప్-1 నియామకాలపై న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ స్టేను ఎత్తివేయాలని కోరుతూ ఉద్యోగాలకు ఎంపి-కై-న కొందరు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు.

## తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. 2025-26 విద్యాసంవ త్సరంలో ప్రవేశాలకు జూన్ 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈపరీక్షకు సంబంధించి ఇటీవల కీ విడుదల చేసిన అధికారులు తాజా గా ఫలితాలను అందుబాటులోకి తీసుకొ చ్చారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నం బర్ ఎంటర్ చేసి మార్కులు, ర్యాంక్‌లను తెలుసుకోవచ్చు. తెలంగాణ ఐసెట్ పరీక్షకు మొత్తంగా 71,746 మంది దరఖాస్తు చేయగా.. 64,938మంది హాజరయ్యారు. వీరిలో 58,985మంది (90.83శాతం) అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడిం చారు. క్వాలిఫై అయిన వారిలో 30,989 మంది అమ్మాయిలు.. 27,998 మంది అబ్బాయిలు ఉన్నారు.

# నాపై ఆరోపణలు నిరూపించాలి

మొదటిపేజీ తరువాయి..

వారిపై రెచ్చిపోయారు. 'మా పిల్లలు ఒక ఖరీదైన షర్ట్ వేసుకుంటే, బండి సంజయ్ వేల కోట్లు సంపాదించాడని ట్రోల్ చేస్తారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పుడిప్పుడే ఒక ఇల్లు కొన్నానని.. బీఆర్ఎస్, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబం తనపై చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. 'కేసీఆర్ కొడుకును, అతని కుటుంబాన్ని సవాల్ చేస్తున్నా. మీ కుటుంబం అంతా రండి. మా కుటుంబంతో సహా వస్తాం. ఏ గుడికైనా పోదాం, బినామీలతో సహా ఆస్తులపై ప్రమాణం చేద్దాం' అని ఆయన కేటీఆర్‌కు నేరుగా సవాల్ విసిరారు. కేసీఆర్ గుండాయిజం తెలంగాణలో నడవదని, నడవనివ్వమని బండి సంజయ్ తీవ్రంగా హెచ్చరించారు. ఇటీవల ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలపై బీఆర్ఎస్ శ్రేణులు దాడులు చేయబోతున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. 'ఏబీఎన్ మీద దాడి చేస్తామని బాహటంగా చెబుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటం సిగ్గుచేటు. తెలంగాణలో ఇకపై ఏ మీడియాపైన దాడి జరిగినా దానికి ప్రతిదాడి తప్పదు' అని బండి సంజయ్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ సమాజం ఇలాంటి ఊకదంపుడు హెచ్చరికలకు, దాడులకు భయపడదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, మీడియాకు అండగా నిలబడటానికి బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా తీవ్ర స్థాయిలో బండి సంజయ్ ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంతో కలిసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఘాటుగా విమర్శించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓవైసీకి చెందిన కళాశాల జోలికి వెళ్లబోమని ట్వీట్ చేయడంపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ అధికారి నిర్ణయం సొంతమా లేక ప్రభుత్వ నిర్ణయమా..? కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలి' అని ఆయన డిమాండ్ చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లోని అనేక మంది పేదల ఇళ్లు, గుడిసెలు కూల్చివేసినప్పుడు గుర్తురాని మానవత్వం, ఇప్పుడు ఓవైసీకి చెందిన కళాశాల విషయంలో ఎందుకు గుర్తుకు వచ్చిందంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ నీతికి నిదర్శనమని బండి సంజయ్ పరోక్షంగా ఆరోపించారు. ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తూ.. మరొక వర్గాన్ని నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ పాలనా తీరును ప్రశ్నిస్తోందని ఆయన అన్నారు. ప్రజాప్రయోజనాలను పక్కన పెట్టి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని బండి ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చివేసేటప్పుడు మానవతా దృక్పథం చూపని ప్రభుత్వం, ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వారి విషయంలో మాత్రం ఎందుకు సున్నితంగా వ్యవహరిస్తోందని ఆయన ప్రశ్నించారు. ఈ రకమైన రాజకీయాలు సమాజంలో అసమానతలకు దారితీస్తాయని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలు ఈ ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో దీనికి తగిన గుణపాఠం చెబుతారని బండి అన్నారు. బీజేపీ ఎప్పుడూ ప్రజా సమస్యల పక్షాన నిలబడుతుందని, ఎలాంటి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడదని ఆయన స్పష్టం చేశారు.

# అక్రమ వెంచర్లపై మౌనమెందుకో?

మొదటిపేజీ తరువాయి..

చట్టబద్ధంగా అనుమతులు లేకుండానే అనేక అక్రమ వెంచర్లు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, బాలాపూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 272, 275, 276, 277, 278, మరియు బాలాపూర్ రెవెన్యూ సర్వేనెంబర్ 90, మలాపూర్ సర్వే నంబర్ 59, అలాగే నాదర్గుల్, బడంగ్‌పేట్, గుర్రం గూడ, మామిడిపల్లి ప్రాంతాల్లో ప్లాటింగ్, నిర్మాణాలు జరుగుతున్నాయని ఆ వినతిపత్రంలో బీజేపీ అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానికులు అనేక మార్లు బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని, అధికారుల ఈ నిర్లక్ష్య ధోరణిపై ప్రజల్లో ఆగ్రహం పెరిగిపోతోందని. కమిషనర్ ఈ అక్రమాలకు పరోక్షంగా ప్రోత్సాహం ఇస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ వెంచర్లు ప్రజల భద్రతకు, మౌలిక వసతుల పరిరక్షణకు పెద్ద ప్రమాదం. చట్టం తప్పిన నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కమిషనర్ నిర్లక్ష్యాన్ని కూడా విచారించాలని అధికారులను కోరుతున్నాం" అని అన్నారు. "ఈ అక్రమాలపై పాలకులు, అధికారులు తక్షణం స్పందించకపోతే బీజేపీ ప్రజల అండతో ఉద్యమబాట పడేందుకు వెనుకాడదు" అని ఆయన హెచ్చరించారు.



# కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంతో మెరుగయ్యాడు



- ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు భారత్ అస్సలు భయపడదు
- టీమిండియాపై సర్వత్రా ప్రశంసల జల్లు

ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో విజయం సాధించిన టీమిండియాపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆదివారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 336 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో టీమిండియాకు ఇదే తొలి విజయం. దాంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టును మాజీ క్రికెటర్లు కొనియాడుతున్నారు. ముఖ్యంగా భారత్‌పై అవకాశం వచ్చినప్పుడల్లా అక్కసు వెళ్లగక్కే ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు కూడా భారత్ విజయాన్ని ప్రశంసిస్తున్నారు. ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు భారత్ అస్సలు భయపడదని మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ అన్నాడు. శుభ్‌మన్ గిల్‌ను కోహ్లీ కెప్టెన్సీతో పోల్చడం సరికాదని నాజర్ హుస్సేన్ తెలిపాడు.'రెండో టెస్ట్ విజయంతో భారత జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. భారత్ ఆట చూస్తుంటే ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు ఏ మాత్రం భయపడమన్నట్లుగా ఉంది. జట్టులో ప్రతీ ఒక్కరిపై టీమ్‌మేనేజ్‌మెంట్ నమ్మకంతో ఉంది. శుభ్‌మన్ గిల్ సారథిగా సత్తా చాటాడు. బ్యాటర్‌గానూ జట్టును ముందుండి నడిపించాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు ఇది తొలి విజయం. చరిత్రలో నిలిచిపోయే క్షణాలు. ఈ ఉత్సాహంతో లార్డ్స్‌లో మరింత దూకుడుగా ఆడే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌పై 20 వికెట్లు తీయడం అతిపెద్ద అచీవ్‌మెంట్. టీమిండియా బౌలింగ్ కాంబినేషన్ బాగుంది. లార్డ్స్‌లో జస్‌ప్రీత్ బుమ్రా కూడా జట్టుతో కలుస్తాడు. అప్పుడు టీమిండియా బౌలింగ్ విభాగం మరింత పటిష్టంగా మారుతోంది. ఇంగ్లండ్ బౌలర్ బషీర్ ఎక్కువగా పరుగులివ్వడం ఇంగ్లండ్‌కు నష్టం చేసింది.'అని మాంటీ పనేసర్ చెప్పుకొచ్చాడు.కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంతో మెరుగయ్యాడు. తొలి టెస్ట్‌లో అతను ఇతరుల సలహాలపైనే ఎక్కువగా ఆధారపడ్డాడు. డగౌట్ సూచనలను ఫాలో అయ్యాడు. కానీ రెండో టెస్ట్‌లో మాత్రం చాలా పరిణతి కనబర్చాడు. పంత్, కేఎల్ రాహుల్ సాయం తీసుకున్నా.. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ నిఖార్సైన కెప్టెన్‌గా కనిపించాడు. అయితే శుభ్‌మన్ గిల్‌ను కోహ్లీతో పోల్చడం సరికాదు. గిల్ మైదానంలో చాలా ప్రశాంతంగా ఉంటాడు.'అని నాజర్ హుస్సేన్ చెప్పుకొచ్చాడు.

# 58 ఏళ్ల రికార్డును చెరిపేసిన టీమిండియా



తొలి టెస్టు మ్యాచ్‌ను కోల్పోయిన భారత క్రికెట్ జట్టు రెండో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. భారీ స్కోర్ చేసిన టీమిండియా ప్రత్యర్థిని దీటుగా ఎదుర్కొని అతి తక్కువ స్కోర్‌కు పరిమితం చేసి భారీ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో 58 ఏళ్ల రికార్డును శుభమన్ గిల్ జట్టు తిరగరాసింది. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో 336 పరుగుల తేడాతో టీమిండియా చారిత్రక విజయం సాధించింది. చివరి రోజు వరకు సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా రాణించి ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయం అందుకుంది. యువ కెప్టెన్ శుభమన్ గిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రికార్డు విజయం సాధించిన భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మూడో టెస్ట్ జూలై 10వ తేదీ నుంచి లార్డ్స్ మైదానంలో జరుగనుంది. 608 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆదివారం 72/3 స్కోర్ వద్ద చివరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ పోరాడలేకపోయింది. 271 పరుగుల వద్ద ఆలౌటైంది. బుమ్రా స్థానంలో వచ్చిన ఆకాశ్‌దీప్ (21.2-2-99-6) సంచలన ప్రదర్శన చేయడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు మైదానంలో నిలబడలేకపోయారు. తొలిసారి ఐదు వికెట్లు తీసి ఆకాశ్‌దీప్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4వికెట్లు పడగొట్టిన ఆకాశ్ దీప్ రెండో టెస్టులో మొత్తంగా 10 వికెట్లు తీయడం విశేషం. మిగతా బౌలర్లలో సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, రవీంద్ర జడేజా,వాషింగ్టన్ సుందర్ తలా ఒక్కో వికెట్ తీశారు. ఆఖరి రోజు మ్యాచ్‌ను డ్రాగా చేసుకోవాలని జేమీ స్మిత్ (88) తీవ్రంగా ప్రయత్నించినా అతడి ప్రయత్నాలు విఫలమయ్యాయి.'

## ఐసీసీ కొత్త సీఈఓగా సంజోగ్ గుప్తా



అంతర్జాతీయ క్రికెట్ మండలిసంజోగ్ గుప్తాను తమ కొత్త సీఈఓగా నియమించింది. సోమవారం ఆయన దుబాయ్‌లోని ఐసీసీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఐసీసీ హిస్టరీలో ఈ పదవిని చేపట్టిన ఏడో వ్యక్తిగా ఆయన నిలిచారు. సంజోగ్ గుప్తా ఇంతకు ముందు జియోస్టార్ స్పోర్ట్స్, లైవ్ ఎక్స్‌పీరియన్స్ విభాగం సీఈఓగా ఉన్నారు. ఈ కీలక పరిణామంలో ఐసీసీ సంజోగ్‌ను తమ వైపునకు తిప్పుకుంది. ఐసీసీకి ఏడవ సీఈఓగా సంజోగ్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆస్ట్రేలియాకు చెందిన జెఫ్ అలార్డిస్ నాలుగేళ్లు సీఈఓగా పనిచేశారు.

# కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలి


## ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్

టీమిండియా విజయం సాధించాలంటే స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్ సూచించాడు. కుల్దీప్ యాదవ్ టీమిండియాకు ఎక్స్ ఫ్యాక్టర్‌గా మారుతాడని చెప్పాడు. తన యూట్యూబ్ చానెల్ వేదికగా భారత తుది జట్టు గురించి మాట్లాడిన మైఖేల్ క్లార్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'భారత స్పిన్ విభాగంలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చారు. రెండో ఇన్నింగ్స్‌లో చెరో వికెట్ పడగొట్టారు. అయితే కుల్దీప్ యాదవ్ లేకుండా టీమిండియాకు 20 వికెట్ల పడగొట్టే సామర్థ్యం ఉందా? కుల్దీప్ యాదవ్ టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడనుకుంటున్నా. అతను తుది జట్టులోకి వస్తే ఎక్స్ ఫ్యాక్టర్‌గా మారుతాడనేది నా అంచనా. రెండో టెస్ట్‌లోనే అతనికి అవకాశం దక్కుతుందని భావించా.'అని మైఖేల్ క్లార్క్ తెలిపాడు. పేస్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి విషయంలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందో ఆసక్తికరంగా ఉందని క్లార్క్ తెలిపాడు. 'నితీష్ కుమార్ రెడ్డి ఏం చేస్తారో? అతన్ని కొనసాగిస్తారా? పక్కనబెడుతారా? చాలా ఆసక్తికంగా ఉంది. రెండో టెస్ట్‌లో అతను అంచనాలను అందుకోలేకపోయాడు. కానీ ఆస్ట్రేలియా గడ్డపై అతని సత్తా ఏంటో మనమంతా చూశాం. అతను జట్టుకు కావాల్సిన పరుగులు చేయడంతో పాటు కావాల్సిన ఓవర్లు బౌలింగ్ చేయగలడు. కానీ ప్రస్తుతం టీమ్‌మేనేజ్‌మెంట్ అతని గురించి సమాలోచనలు చేస్తుంది. బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు కాబట్టి బౌలింగ్ విభాగంలో ప్రసిధ్ కృష్ణపై వేటు పడవచ్చు. బుమ్రా కోసం అతన్ని తుది జట్టు నుంచి తప్పించవచ్చు.'అని మైఖేల్ క్లార్క్ పేర్కొన్నాడు.



# కింగ్డమ్ రిలీజ్‌కు సిద్ధం

టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'కింగ్డమ్'. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ ఇంటెన్స్ యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్, గ్లింప్సెస్ చూసిన ప్రతి ఒక్కరికీ ఆయనలో కొత్త యాంగిల్ కనిపిస్తోంది. ఈ పాత్ర కోసం విజయ్ భారీగా ట్రాన్స్‌ఫర్మ్ అయినట్టు- సమాచారం. అతని పెర్ఫార్మెన్స్ ఈసారి మరో లెవెల్‌లో ఉండనుందట. ఇక భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా.. ఇటీవల వరుస వాయిదాలు తీసుకుంటూ వచ్చిన 'కింగ్డమ్', ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకుంది. ఇప్పటికే రిలీజ్ వాయిదాల కారణంగా నిరాశ చెందిన ఫ్యాన్స్ ఇప్పుడు ఊపిరి పీల్చు కుంటు-న్నారు. మొత్తనికి 'కింగ్డమ్' మూవీ, ఇప్పుడు దూసుకెళ్లేందుకు సిద్ధమైంది. అభిమానులకూ, బాక్సాఫీస్‌కి ఇది మంచి ఉత్సాహం కలిగించే సినిమా కావొచ్చని ఇండస్ట్రీలో జోరుగా చర్చ సాగుతోంది.




# చిరు సినిమాలో వెంకటేశ్!




స్టార్ హీరో వెంకటేశ్ తన రానున్న సినిమాల లైనప్ చెప్పి అభిమానుల్లో జోష్ నింపారు. అమెరికాలో వైభవంగా జరిగిన 'నాట్స్ 2025'లో సందడి చేసిన వెంకటేశ్ తన సినిమాల గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఇవి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వెంకీ చిరంజీవి సినిమాలో కనిపించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని వెంకీ మామ కూడా ధ్రువీకరించారు. ఆ పాత్ర ఎలా ఉంటుందో కూడా చెప్పారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నా. అలాగే చిరంజీవి సినిమాలో అతిథి పాత్రలో నటిస్తున్నాను. అది చాలా ఫన్నీగా ఉంటు-ంది. ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది. అలాగే మీనాతో కలిసి 'దృశ్యం 3' సినిమా చేస్తున్నా. ఇటీవల అనిల్ రావిపూడితో కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం'తో హిట్ కొట్టాం. మేమిద్దరం మళ్లీ రాబోతున్నాం. వీటన్నింటితో పాటు- మరో భారీ ప్రాజెక్ట్‌లో నా స్నేహితుడితో కలిసి నటిస్తున్నాను. తెలుగు ఇండస్ట్రీలో ఆయన ఓ పెద్ద స్టార్' అని వెంకటేశ్ తెలిపారు. తనపై ప్రేమాభిమానాలు చూపుతోన్న అభిమానులకు నాట్స్ వేదికగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ ఏడాది పెద్ద పండగకు 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నారు వెంకటేశ్. వచ్చే సంక్రాంతికి అనిల్ రావిపూడి - చిరంజీవి కాంబోలో రానున్న సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. వినోదంతో పాటు- బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్-టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో వెంకటేశ్ కనిపించనున్నారు. ఇందులో చిరు సరసన నయనతార నటిస్తున్నారు. దీంట్లో శివశంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో చిరు సందడి చేయనున్నారు.

# మళ్లీ టీవీ షోల్లో స్మృతి ఇరానీ



మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ. మళ్లీ టీవీ షోల్లో నటిస్తోంది. రాజకీయాల్లోకి రాకముందు క్యోంకి సాస్ బీ కబీ బహు తీ .. సీరియల్‌లో స్మృతి నటించేది. అయితే ఫుల్ టైం రాజకీయాల్లోకి వచ్చాక ఆమె ఆ షోకు బ్రేక్ వేసింది. ఇప్పుడు మళ్లీ క్యోంకి సాస్ బీ కబీ బహు తీ షోలో నటిస్తోంది. దానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.

# వ్యక్తిగత జీవితం కోల్పోతున్నా

## స్టార్ హీరోయిన్ రష్మిక మంధాన్న ఆవేదన

పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా వెలుగొందుతున్న అందాల నటి రష్మిక మందన్న. ఇటీవల ఈ ముద్దుగుమ్మ నటించిన ప్రతి సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది. అయితే కెరీర్‌లో అగ్రస్థాయికి చేరుకున్నా, దాని వెనక తన వ్యక్తిగత జీవితంలోచేసిన త్యాగాలు, ఎడబాటు- గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయింది. రష్మిక ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నేను దాదాపు ఏడాదిన్నరగా మా ఇంటికి వెళ్లలేకపోయాను. నా చెల్లి ఇప్పుడు 13 ఏళ్లు. ఆమెతో గడిపే అమూల్యమైన క్షణాలను కోల్పోతున్నానని ఎప్పుడూ బాధగా అనిపిస్తుంది. నాకు ఆమెకి 16 ఏళ్ల తేడా. అయినా, మా మధ్య అనుబంధం చాలా బలంగా ఉంది. ఒక్కోసారి శని, ఆదివారాలు ఇంట్లో ఉండాలనిపిస్తుంది... సెలవు దొరక్క ఏడుపొస్తుందని బాధపడింది. కేవలం కుటుంబం మాత్రమే కాదు, స్నేహితుల నుండి కూడా దూరం అయ్యాను. ఒకప్పుడు చిన్న చిన్న ట్రిప్స్‌కు, పార్టీకి నన్ను పిలిచే స్నేహితులు ఇప్పుడు కాల్ చేయడం మానేశారు. ఎందుకంటే, ఆవిడ బిజీగా ఉంటు-ంది అనే భావన వాళ్లలో నెలకొందని నేను ఫీలవుతున్నాను. నిజానికి వాళ్లతో పాటు గడిపే క్షణాలు జీవితానికి చాలా అవసరం. కానీ ఈ బిజీ షెడ్యూల్ కారణంగా వాళ్లను మిస్ అవుతున్నాను. తన తల్లి చెప్పిన మాటలని కూడా రష్మిక గుర్తు చేసుకుంది. మా అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. జీవితంలో రెండు దారులు ఉంటాయి. ఒకటి కెరీర్, మరొకటి వ్యక్తిగత జీవితం. రెండింటినీ బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. కానీ నేనైతే రెండు వైపులా సమంగా వెళ్తానని నమ్మే మనస్తత్వం ఉన్న వ్యక్తిని. కానీ నిజంగా ఇది ఎంత కష్టం అనేది ఇప్పుడు అనుభవిస్తున్నాను అని రష్మిక పేర్కొంది. ప్రస్తుతం రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.బాలీవుడ్‌లో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'తామా', తెలుగులో 'ది గర్ల్‌ఫ్రెండ్', 'మైసా' చిత్రాలు చేస్తుంది. అయితే రష్మిక కామెంట్స్‌పై నెటిజన్స్ తమదైన శైలిలో కామెంట్స్ చేస్తున్నారు. స్టార్స్ కూడా మనలానే మానవులే... వాళ్లకూ కుటుంబాలుంటాయి, బాధలుంటాయి' అంటూ పలువురు ఎమోషనల్ కామెంట్లు పెడుతున్నారు.



Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.